# వంకాయలో పురుగు

– ఇలపావులూరి మురళీమోహనరావు

''బయటకు నవనవలాడుతూ కనపడుతున్న ఈ వంకాయలలో ఈ పాడు పురుగులెలా చేరుతాయో?'' కళ్ళు ఇంతలావు చేసి అడిగాడు రామశాస్త్రి.

''మన పెళ్ళైనప్పటి నుంచి ఈ ప్రశ్న అడుగుతూనే ఉన్నారు. చదువుసంధ్యల్లేని నన్నడిగే బదులు ఆ విషయమేదో మీరే పరిశోధించి నాకు చెప్పొచ్చుగా'' నవ్వుతూ అన్నది సీతమ్మ.

''కొన్ని సృష్టి రహస్యాలు కనిపెట్టడం మనిషి వల్ల కాదోయ్. ఆ భగవంతుడికే తెలియాలి. విత్తనాలు పాతి పెడతారు. మొక్క మొలుస్తుంది. నీరు పోస్తాం. ఎరువులు వేస్తాం. పెరుగుతుంది. పిందెలు వేస్తుంది. బాగా నీలం రంగు వచ్చిన తర్వాత కోస్తాం. తీరా దాన్ని తరిగితే ఇంత పెద్ద పురుగుంటుంది. అసలీ పురుగు దాంట్లోకి ఎలా వెళ్ళింది? ఎలా పెరిగింది? దానికి గాలీ, వెలుతురు, ఆహారం ఎలా లభిస్తాయి? అది అటు ఇటు తిరగడానికి పెద్ద చోటు కూడా ఉండదు. ఆక్సిజన్ లేందే ప్రాణి క్షణం కూడా బ్రతకదే! దానికి ఆక్సిజన్ ఎలా లభిస్తుంది? ఎంత విచిత్రం?'' అన్నాడు రామశాస్త్రి.

ప్రశ్నల మీద ప్రశ్నలు వేస్తున్న భర్తను మురిసిపోతూ చూస్తున్నది సీతమ్మ.

రాగి చెంబు వంటి తల మధ్య భాగం వరకు రెండు వేళ్ళ మందాన తీర్చిదిద్దిన తిరునామాలు, చెవులకు కుండలాలు, మెడలో ముక్తావళి, రెండు చేతులకు కంకణాలు, పచ్చని మేనిఛాయలో అరవై ఏళ్ళ వయసులో కూడా బలిష్టంగా ఉన్న శరీరంతో, సెకనుకోసారి మారే హావభావాలతో భర్త ప్రశ్నలు సంధిస్తుంటే పతిని ప్రత్యక్ష దైవంగా పూజించే భారతనారి సీతమ్మ రామశాస్త్రిని పసిబిడ్డను చూస్తున్నంత అబ్బురంగా చూడసాగింది.

రామశాస్త్రికి వంకాయ అంటే పంచప్రాణాలు. కూరగానో, వేపుడుగానో, గుత్తిగానో, కారపు కాయగానో, పచ్చడిగానో, కాల్చి బజ్జీగానో ఏదొక రూపంలో వంకాయ విస్తట్లో లేంది ఆయన భోజనం చెయ్యడు. పొరపాటున ఎప్పుడైనా చెయ్యకపోతే ఒట్టి వంకాయనుచీల్చి ఉప్పుకారం పెట్టుకుని తింటాడు.

వంకాయ పట్ల భర్త వ్యామోహాన్ని గమనించిన సీతమ్మ ఏనాడూ భర్తకు ఆ లోటు రానీయలేదు. అత్తగారు ఆఖరు ఘడియల్లో సీతమ్మ చేతిని తన చేతిలోకి తీసుకొని తన కొడుక్కు రెండు పూట్లా వంకాయతో ఏదైనా పదార్థం చేసి పెట్టాలని ఒట్టు వేయించుకుంది.

కూరలు కొనడానికి తానే స్వయంగా వెళ్తాడు రామశాస్త్రి. వంకాయల రాశిని చూస్తూనే పెద్ద అయస్కాంతం పిన్నీసును లాక్కున్నట్టు గబగబా పరుగుతీస్తాడు. రాశి ముందు కూర్చుని ఒక్కొక్క దాన్ని వజ్రపు ముద్దను చూస్తున్నంత ఆప్యాయంగా చూస్తూ, అటు ఇటు తిప్పుతూ ఎక్కడైనా పుచ్చులున్నాయేమోనని ఒకటికి వంద సార్లు చూస్తూ ఏరుకుని తీసుకు వస్తాడు.

భార్యను ఎదురుగా కూర్చుని తరగమంటాడు. పుచ్చు వంకాయ ఏదైనా వస్తే విలవిలలాడిపోతాడు.

''వంకాయలోకి ఈ పురుగు ఎలా చేరుతుందో'' అని ఆశ్చర్యంగా ప్రశ్నిస్తాడు.

ఆ ప్రశ్నను రామశాస్త్రి నోటి నుండి కనీసం లక్షసార్లయినా విని ఉంటుంది సీతమ్మ.

ఎప్పుడైనా ఎక్కువ పుచ్చులు వస్తే ''ఈ రోజు వంకాయలమ్మిన అమ్మాయి మంచి అందగత్తె అయి ఉంటుంది'' అని ఛలోక్తి విసురుతుంది.

''కావచ్చు. అందుకే కిలోకి పావుకిలో పుచ్చులు వచ్చాయి. ఆ వంకాయలమ్మే పిల్లవు నీవైతే కిలో వంకాయలూ పుచ్చులయ్యేవి'' అని చెణుకు విసురుతాడు రామశాస్త్రి.

ఆ మాటలకు ముసిముసిగా నవ్వుకుంటుంది సీతమ్మ. ఆమె అలా నవ్వుతున్నప్పుడు ఆరాధనగా చూస్తాడు రామశాస్త్రి.

''భార్యకు అరవై ఏళ్ళొస్తే తల్లితో సమానం. భర్తకు అరవై ఏళ్ళొస్తే కొడుకుతో సమానం. పసితనంలో తల్లి ఆదరణకు తపించినట్టు భార్య ఆదరణకు తపిస్తాడు మగవాడు. మాటలు రాని పసిబిడ్డ అవసరాలు గమనించి తీర్చడం తల్లికే సాధ్యం. అలాగే భర్త అవసరాలు గమనించి తీర్చే భార్యలో కన్నతల్లిని చూస్తాడు మగాడు. నువ్వు నా కన్న తల్లి కన్నా మిన్న'' అన్నాడు రామశాస్త్రి.

విశాలమైన సీతమ్మ కనుద్వయం నుంచి సన్నటి నీటి చుక్కలు రాలాయి. భర్త పాదాలకు నమస్కరించింది.

''ఈ వయసులో మీ నుంచి ఈ ఆదరణ నోచుకున్న నా జన్మధన్యం. మీకు గోరుముద్దలు తినిపిస్తూ మరణించాలనేది నా కోరిక ఆశీర్వదించండి'' అన్నది.

''ఛ ఛ... ఏమిటా కన్నీరు? నీ గోరుముద్దలు తినలేనప్పుడు నేను మాత్రం ఉంటానా ఏమిటి? పద పద.. నూనె కొంచెం జాస్తిగా పోయి. వంకాయలు నూనెలో జలకాలాడుతూ కేరింతలుకొట్టాలి సుమా'' అన్నాడు రామశాస్త్రి.

పెద్ద వెండి విస్తరిలో పది కాయలు వేసుకుని అరిచేయంతా నూనె మయమై పెద్ద పెద్ద గుండ్రాళ్ళంత ముద్దలు ఎగరేస్తూ రామశాస్త్రి తింటుంటే కాలేయం లేనివాడికి కూడా పేగులు ఆర్తనాదాలు చేస్తాయి. మూగవాడు కూడా 'నాకూ అన్నం పెట్టండ'ని అరుస్తాడు. ఒక వేళ పొట్టి శ్రీరాములు కనుక రామశాస్త్రి వంకాయ కూర కలుపుకోవడం చూసి ఉంటే నిరాహారదీక్ష చేపట్టి అమరజీవి అయ్యేవాడు కాదేమో!

ఒక్కొక్కసారి తన దిష్టి కూడా తగులుతుందని సీతమ్మ కూడా కళ్ళు మూసుకుంటుంటుంది.

''అబ్బ... మరీ అంత ఆత్రం ఏంటండీ. ఇదివరకంటే కాలేజీ ఉంది కాబట్టి హడావిడి. ఇప్పుడు రిటైరయ్యారు కదా! నెమ్మదిగా తినండి'' సున్నితంగా మందలిస్తుంది సీతమ్మ.

''మగాడు కాళ్ళుతడి ఆరకముందే భోంచెయ్యడం ముగించాలట.... ఆలస్యమైతే పదార్థాల రుచి తగ్గిపోతుంది. అదీ అసలు విషయం'' సామెత చెప్పి దాని అంతరార్థం కూడా వివరించాడు రామశాస్త్రి.

ఫక్కున నవ్వింది సీతమ్మ.

రామశాస్త్రి మహాపండితుడు. కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పని చేశాడు. ఏడెనిమిది గ్రంథాలు రచించాడు. చాలా అవార్డులు, సన్మానాలు స్వీకరించాడు. సభల్లో రామశాస్త్రి ఉపన్యాసముంటే చీమ దూరను సందుండేది కాదు. ఆద్యంతం పాండిత్య విషయాలు, చమత్కారాలతో ఆహూతులను మంత్రముగ్ధులను చేస్తాడు రామశాస్త్రి. ఎంతసేపు విన్నా ఆయన మాటలు ఇంకా వినాలనిపిస్తాయి. ఆ విషయంలో తన అదృష్టానికి తానే మురిసిపోతుంటుంది సీతమ్మ.

దిట. అయితే తండ్రీ కొడుకులకు పెద్దగా సఖ్యత ఉండేది కాదు.

నాగశాస్త్రి భోజనానికి కూర్చున్నాడు.

''నాన్నా, దళిత జాతుల మీద నేను రాసిన సిద్ధాంత వ్యాసానికి డాక్టరేట్ ఇచ్చారు. ఇందాకే టెలి గ్రామ్ వచ్చింది'' అన్నాడు.

లోపల సంతోషించాడు రామశాస్త్రి. పైకి మాత్రం 'ఉద్ధరించావులే' అన్నాడు.

''వింటున్నారా... మన వాడు ఇక నుంచి డాక్టరట'' అన్నది సీతమ్మ.

''డాక్టరనుకుని వాడి వద్ద ఏదైనా మందు తీసుకునేవు'' వ్యంగ్యంగా అన్నాడు



''ఆహా! అదా సంగతి. తమ స్వార్థం కోసం సామెతలు సృష్టించారన్న మాట పండితులు!'' నవ్వుతూ అన్నది. తృప్తిగా భోంచేసి లేచాడు రామశాస్త్రి.


వాకిట్లో స్కూటర్ శబ్దం వినిపించింది. నాగశాస్త్రి లోపలకు వచ్చాడు.

''అమ్మా... త్వరగా అన్నం పెట్టు, ఆకలి మండిపోతున్నది'' అన్నాడు.

''ముందు కాళ్ళు కడుక్కోరా అప్రాచ్యుడా'' అన్నాడు రామశాస్త్రి కోపంగా.

రామశాస్త్రి ఎంత సనాతనుడో నాగశాస్త్రి అంత ఆధునికుడు. తండ్రి చెప్పే ఆచారాలు, మడి, పూజల లాంటివి అతనికి నచ్చవు. సంస్కృతం నేర్చుకోమని తండ్రి కోరితే సుతరామూ చదవనని పట్టుబట్టి ఇంగ్లీష్ మీడియంలో చదివాడు. ఇంగ్లీషు చదువుతున్నాడని కొడుకును 'అప్రాచ్యుడా' అని పిలుస్తాడు.

నాగశాస్త్రి బాగా చదువుకుని తండ్రి పని చేసే కాలేజీలోనే లెక్చరర్ అయ్యాడు. నాగశాస్త్రి ఇంగ్లీషు పాఠాలు బోధిస్తుంటే అరటిపండు వలిచి నోట్లో పెట్టినట్లుంటుం




రామశాస్త్రి.

అసలు విషయమేమిటంటే ఈ సిద్ధాంత వ్యాసం రాయడానికని నాగశాస్త్రి దేశం నాలుగు చెరగుల్లో అనేక మాలమాదిగ వాడలను దర్శించాడు. వాళ్ళల్లో మమేకమైపోయి వారితో పాటే స్నానపానాదులు చేశాడు. రామశాస్త్రికి ఈ తతంగం సుతరామూ ఇష్టంలేదు. అయితే ఒక్కగా నొక్క కొడుకు కావడం చేత, మరణానంతరం తలకొరివి పెట్టవలసిన వాడవటం చేత ఏమీ అనలేకపోయాడు.

''హు! మీరు ఏనాడు నా విషయంలో సంతోషించారు గనుక? కాకపోతే అమ్మ బయటపడదు. నువ్వు బయట పడతావు. అంతే!'' ముఖం చిన్న బుచ్చుకుని అన్నాడు నాగశాస్త్రి.

''ఒరేయ్ శాస్త్రీ! నిజంగా మమ్మల్ని సంతోషపెట్టాలనుకుంటే మా మాటలు పెడచెవిన పెడతావట్రా? నీ పెళ్ళి విషయం చెప్పి ఎన్నాళ్ళైంది? ముడ్డి క్రిందికి ముప్పై ఏళ్ళొచ్చాయి...'' చెప్పబోయాడు రామశాస్త్రి.

''అబ్బబ్బ.. ఆ చాదస్తపు భాష ఆపు. నువ్వు తెలుగులో ఉద్దండ పండితుడవే. అంతమాత్రాన మరీ అన్‌పార్లమెంటరీ, అన్‌ప్రింటబుల్ లాంగ్వేజ్ యూజ్ చెయ్యకు'' చెవులు మూసుకుంటూ అన్నాడు నాగశాస్త్రి.

''ఆ జటావల్లభ శాస్త్రిగారు తెగ తిరిగిపోతున్నారు. మన సాటివాడు. నలుగురు ఆడపిల్లల తండ్రి. ఆయనను అన్నిసార్లు తిప్పించుకోవడం మర్యాద కాదు. వారి పెద్దమ్మాయి నీకు అన్ని విధాలా తగిన భార్య అవుతుంది'' అన్నాడు రామశాస్త్రి.

ఆ మాట వినగానే నాగశాస్త్రి ముఖం ముట ముట లాడింది.

''నేనిప్పటికి లక్షసార్లు చెప్పాను. ఆ నల్లతుమ్మ మొద్దును నేను చేసుకోను. చదువు సంధ్యల్లేని ఆ పిల్లను నేను భరించలేను'' అన్నాడు.

''ఏం? మీ అమ్మకు చదువు సంధ్యల్లేకపోతే నేను చేసుకోలా? నేను సుఖపడలా?''

''ఆ రోజులు వేరు. ఈ రోజులు వేరు. పిల్లలను కనగానే సరా? వారికి విద్యాబుద్ధులు చెప్పించద్దూ? ఇన్‌మై వ్యూ సచ్ పీపుల్...''

''ఆపరా నీ వాగుడు. జటావల్లభ శాస్త్రికి కాలం కలిసి రాలేదు. నాల్గో ప్రసవంలో భార్య చనిపోయింది. దాంతో పిల్లల ఆలనా పాలనా తానే చూడవలసి వచ్చింది. దాంతో సంపాదన తగ్గింది. లేకపోతే ఈ చుట్టుప్రక్కల నూరు ఆమడల్లో ఆయనను మించిన పురోహితుడున్నాడా? పెద్ద చదువులు చదివించలేకపోయాడు. అంతమాత్రాన అమ్మాయి మొద్దేమీ కాదు. అమరకోశం, స్వారోచిష మనుసంభవం ఆమూలాగ్రంగా వల్లె వెయ్యగలదు.''

''ఆహా!... అయితే ఆ అమ్మాయిని దగ్గర కూర్చోబెట్టుకుని పురాణాలు, ఉపనిషత్తులు వల్లె వేయించుకుని విని తరించండి. ఐ హావ్ నో అబ్జెక్షన్. బట్ షి ఈజ్ నాట్...'' వెటకారంగా అన్నాడు నాగశాస్త్రి.

''ఇంట్లో ఆ దరిద్రపు భాష కూశావంటే కుతిక పిసుకుతాను అప్రాచ్యపు వెధవా'' కోపంగా లేచాడు రామశాస్త్రి.

''ఒరేయ్ నాయనా.... మనకు కావల్సింది ఇంగ్లీషు, అరవం తెలిసిన అమ్మాయి కాదురా. మన పరువును కాపాడే అమ్మాయి. పాలలో పంచదారలా కలిసిపోయే అమ్మాయి. నూనె మీది నీటి చుక్కలాంటి పిల్లకోసం పాకులాడకు. నాన్నగారి మాట విను'' బ్రతిమలాడింది సీతమ్మ.

''అమ్మా... నా మనసును చంపుకునే పరిస్థితి రానీకు. ఆకలితో దహించుకు పోతున్న భర్తకు అడిగిన వెంటనే అన్నం పెట్టే భార్య నాకు కావాలి. అంతేగానీ దేవుడికి నైవేద్యం పెట్టేందాకా ఆగండి అనే భార్య నాకు వద్దు. ఈ ఆచారాలు వ్యవహారాలు... అంతా సూపర్‌స్టిషన్స్. ఐ డోన్ట్ లైక్ దెమ్'' విసురుగా బయటకు వెళ్ళిపోయాడు నాగశాస్త్రి.

''రెక్కలొచ్చిన పక్షి గూడు వదిలి ఎగిరిపోవాలనే అనుకుంటుంది. ఇంకా తన రెక్కల క్రిందే ముడుక్కుని కూర్చోవాలని తల్లిపక్షి అనుకోకూడదు'' నిట్టూరుస్తూ అన్నాడు రామశాస్త్రి.

ఆ రాత్రి నాగశాస్త్రి ఇంటికి రాలేదు. రామశాస్త్రి, సీతమ్మ ఆందోళన చెందారు. ఆ రాత్రి శివరాత్రి అయింది.

మర్నాడు కాలేజీకి వెళ్ళి విచారించాడు. నాగశాస్త్రి కాలేజీకి కూడా రాలేదు. రామశాస్త్రికి బి.పి ఆరంభమైంది. సైకిల్ మీద ఊరంతా తిరిగాడు. తెలిసిన వారిళ్ళన్నీ గాలించాడు. రామశాస్త్రి అభిమానులు, శిష్యులు కూడా వెతుకులాట సాగించారు. నాగశాస్త్రి జాడలేదు.

భార్యాభర్తలిద్దరూ ఆ రోజు ముద్ద ముట్టలేదు. రెండు రోజులు గడిచాయి. రామశాస్త్రి మళ్ళీ కాలేజీకి వెళ్ళాడు. అక్కడ ప్రిన్సిపాల్, లెక్చరర్స్ చెప్పిన మాట వినగానే రామశాస్త్రి గుండె గుభేల్ మంది. రామశాస్త్రి ఎప్పటి నుంచి కాలేజీకి రావడం లేదో అదే రోజు నుండి సోషల్ లెక్చరర్ రోజలీల కూడా రావడం లేదట!

ఐదారుగురు కలిసి రోజలీల ఇంటికి పరుగు తీశారు. రామశాస్త్రిని చూస్తూనే రోజలీల తండ్రి విల్సన్ భగ్గుమన్నాడు.

''మా అమ్మాయిని స్టేట్స్‌కు పంపాలని కలలు కన్నాను. మీ వాడు సైతాన్‌లా అడ్డంపడి మా అమ్మాయిని గద్దలా తన్నుకుని పోయాడు. న్యూయార్క్‌లో ఉన్న నా మేనల్లుడికి నేనేం సమాధానం చెప్పాలి?'' అరిచాడు.

గుడ్లనీరు కుక్కుకుని తలవంచుకుని ఇంటికి వచ్చాడు రామశాస్త్రి. వాలుకుర్చీలో నిస్త్రాణగా నడుం వాల్చాడు.

''శుద్ధ శ్రోత్రియ కుటుంబం. నిప్పును శుద్ధి చేసే వంశం. ఆచారాలనే ఆభరణాలుగా భావించి బ్రతికిన చరిత్ర గల కుటుంబంలో ఇంత నీచుడు, హీనుడు ఎలా చేరాడో అర్థం కావడం లేదు'' నీరసంగా అన్నాడు.

''హు!.. వంకాయలో పురుగు చేరినట్టు...'' అన్నది సీతమ్మ.

సీతమ్మను సూటిగా చూశాడు రామశాస్త్రి. ఆమె నుదిటిమీద రూపాయి కాసంతటి కుంకుమతో విజ్ఞాన దేవత సరస్వతీ దేవి సాక్షాత్కరించింది ఆయనకు.

ఆమె కూరలు తరుగుతున్నప్పుడు 'వంకాయలో పురుగు ఎలా చేరుతుంది' అని ప్రశ్నించలేదు మళ్ళీ.